# "మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి"

## మత్తయి 5:14-16, పరిశీలన

"నీవు అనుకునే దానికంటెను ఎక్కువ విలువైన వాడవు" అనే మన గత ప్రసంగంలో, కొండ మీద ప్రసంగంలోని రెండవ భాగాన్ని చదువ నారంభించాం: మత్తయి 5:13–16. "మీరు లోకమునకు ఉప్పయి యున్నారు" అనే దానిలో ఏమి యిమిడి ఉందో మనం మాట్లాడుకున్నాం. ఈ ప్రసంగంలో 14నుండి 16 వచనాల వరకు మనం చర్చించుకుందాం:

> మీరు లోకమునకు వెలుగైయున్నారు; కొండమీదనుండు పట్టణము మరుగై ఉండనేరదు. మనుష్యులు దీపము[1] వెలిగించి కుంచము క్రింద పెట్టరు కాని అది యింటనుండు వారికందరికి వెలుగిచ్చుటకై దీపస్తంభము మీదనే పెట్టుదురు. మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారియెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి.

### అభినందన

"మీరు లోకమునకు వెలుగైయున్నారు." ఈ ప్రతిపాదనను నీవు తీవ్రంగా యోచించినట్టయితే, అది నీ మనస్సును తడబడజేస్తుంది. క్రైస్తవులుగా మనం దేవుని ఏర్పాట్లలోను సంకల్పంలోను పాలుపొందడం మాత్రమేగాక, కొంతవరకు, దేవునికి క్రీస్తుకు గల విశేష లక్షణములలో కూడా పాలివారమై ఉంటామని ఈ మాటలు తెలుపుతున్నాయి. "దేవుడు వెలుగై ఉన్నాడు" అని యోహాను తెలిపాడు (1 యోహాను 1:5). "నేను లోకమునకు వెలుగును" అని యేసు అన్నారు (యోహాను 8:12). అయితే ఈ వచనాలలో, తన శిష్యులను గూర్చి మాట్లాడుతూ, "మీరు లోకమునకు వెలుగైయున్నారు"[2] అని క్రీస్తు అంటున్నాడు! దేవుని బిడ్డగా యిది నీ తలను ఎత్తుకునేలా చేయడం కన్నా, యిది మరి ఏదియూ కాదు.

"మీరు లోకమునకు వెలుగైయున్నారు" అనడంలో, ప్రభువు చెప్పదలచినదేమి? ఉప్పు, వెలుగులకు మధ్యగల తారతమ్యాన్ని గూర్చి ఆలోచించు. ఆ దినాల్లో ఉప్పు ప్రాథమికంగా వ్యతిరేక ఉద్దేశంతో కూడి ఉంది: వెలుగు యొక్క ప్రాథమిక ఉద్దేశము నిశ్చయమైనది: అది చీకటిని పారద్రొలునది.

మరలా, క్రీస్తు ఉపయోగించిన ఉదాహరణ లోకాన్ని గూర్చి ఒక సంగతిని, క్రైస్తవులను గూర్చి మరొక సంగతిని తెలియజేస్తుంది: లోకము చీకటిమయమని అది తెలియజేస్తుంది. లోకనివాసులు దీనిని అంగీకరించడానికి యిష్టపడరు. కొన్నిసార్లు జనులు బైబిలును

నిరాకరించేటప్పుడు, "జ్ఞాన యుగంలో" మేమున్నామని అంటారు. "నూతన రుజువు వెలుగులోనికి వచ్చింది" అనే ప్రయోగం నీవు విన్నావో లేదో. అయితే యింతకు వాస్తవమేమంటే ఈ లోకం పాపం అనే అంధకారంలో మునిగి ఉంది. దేవుని పరిశుద్ధ వాక్యంతో వెలుగని ఏ వివేకమైనా, అది అంధకారపు తెలివియే.

వాస్తవానికి లోకం చీకటిని కోరుకుంటుంది. "అంధకార సంబంధంగా దాగిన సంగతులను" వెలుగు బయలుపరచుతుంది (1 కొరింథీ. 4:5). "తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమించక చీకటినే ప్రేమించిరి" అని తన కాలపు ప్రజలను గూర్చి ప్రభువు తెలిపాడు (యోహాను 3:19). కొంత కాలం క్రిందట నేను నా భార్య అద్దెవల్లవచ్చే ఆస్తిని కలిగియున్నాను. ఒక కుటుంబం ఖాళీచేసి వెళ్లిన తరువాత, ఇంటిని చూచుకొనడానికి మరుసటి సాయంత్రం మేము ఆ యింటికి వెళ్లాం. వారు చాలా మురికిగాను, భయంకరమైన స్థితిలోను దానిని విడిచి వెళ్లారు. మేము లైటు వేసినప్పుడు, ఆయా పురుగులు పలుదిశలుగా వెళ్లనారంభించాయి. బిళ్ల పురుగునకు లైటంటే యిష్టం ఉండదు! పాప లోకానికి కూడా అంతే, ఏదియెలాగున్నా, లోకానికి ఖచ్చితంగా కావలసింది వెలుగే.

లోకం చీకటిలో ఉన్నదని మాత్రమే మన లేఖన భాగం ప్రకటింపక, క్రైస్తవులు లోకమునకు వెలుగైయున్నారు అని కూడా తెలిపింది. క్రైస్తవులనే వారి దగ్గర వెలుగుంది. క్రీస్తును గూర్చియు బైబిలును గూర్చియు నీవు ఎరిగియుంటే, అప్పుడు వివాహము, బిడ్డలను పెంచడం, సమస్యల నెదుర్కొనడం, ఏ PhD కంటెను జీవితం అంటే ఏమిటో నీవు ఎరిగి ఉంటావు.[3]

క్రీస్తు శిష్యులుగా మనం మన వెలుగును ప్రకాశింపనియ్యాలి. సరియైన జీవితాన్ని జీవించడంవలన అది ప్రకాశించాలి. దేవుని వాక్యము బోధించుటవలన అది ప్రకాశ మానం కావాలి.[4]

లోకములో ఉన్న నైతిక, ఆత్మసంబంధమైన చీకటి నాకు యిష్టంలేదు. ఆ చీకటి నన్ను నిరుత్సాహ పరచుతుందని నేను ఒప్పుకోవాలి. కొన్నిసార్లు ఆ చీకటి ఎంతగా ఎదుగుతుందంటే, దాన్నిబట్టి నేను వదలుకోవాలనుకుంటాను. ఆలాటి పరిస్థితిలో, చీకటియే లేకుంటే వెలుగుకు విలువలేదని నాకు నేనే జ్ఞాపకం చేసికొంటాను. చీకటిని పారద్రోలడమే వెలుగులోని ఉద్దేశం. అందుకే దేవుడు ఈ సమయమందు ఈ స్థలములో నన్ను ఉంచాడు![5]

దీనికి సంబంధించిన లేఖన భాగము ఫిలిప్పీ. 2:15, 16. పౌలు తన పాఠకులను యిలా ప్రోత్సహించాడు: "మీరు నిరపరాధులును నిష్కళంకులును అనింద్యులునైన దేవుని కుమారులగునట్లు, జీవవాక్యమును చేతపట్టుకొని, లోకమందు జ్యోతులవలె కనబడు చున్నారు."

ఈ విషయం ఆలోచించు: చీకటి ఎంత అంధకారంగా ఉంటుందో, వెలుగు అంత ప్రకాశవంతంగా ఉంటుంది. నా బెడ్ రూములో (పడకగదిలో) చిన్న పచ్చలైట్ ఎప్పుడు వెలుగుతునే ఉంటుంది. పగటి పూట ఆ లైటును గుర్తించలేం. కాని, రాత్రుల్లో మాత్రం, చీకటికి నా కండ్లు సర్దుకున్నాక ఆ చిన్న పచ్చలైట్ సహాయంతో గదిలో[6] ఉన్నవన్నీ

కన్పిస్తాయి. సమస్తం చీకటిగా ఉన్నప్పుడు ఆ చిన్న వెలుగుకు కూడా విలువ ఉంటుంది.

మనలో ఏదో ప్రకాశించే శక్తి ఉన్నందున మనం "వెలుగు" అయ్యున్నట్టు భావించనవసరం లేదని నేను నొక్కి చెప్పుతున్నాను. వెలుగుకు మూలమైయున్న దేవునితోను, క్రీస్తుతోను మనకు సంబంధమున్నందుననే మనము "వెలుగై" యున్నాము. సూర్యుని వెలుగును చంద్రుడు ప్రతిఫలింపజేస్తున్నాడు గనుక, క్రైస్తవులు చంద్రునితో పోల్చబడవచ్చు. వెలుపలనుండి వచ్చే శక్తివలన వెలిగే బల్బులకు కూడా క్రైస్తవులు పోల్చబడవచ్చు. అయినప్పటికి, "మీరు లోకమునకు వెలుగై ఉన్నారు" అని అనడంతో క్రీస్తు మనలను గొప్పగా ఘనపరచాడు.

## సవాలు

క్రీస్తు ప్రభువు మాటలు కేవలం అభినందనతో కూడినవి మాత్రమే కాదు. వాటిలో ఒక సవాలు కూడా యిమిడియుంది: మన వెలుగును ప్రకాశింపనియ్యాలి.

"కొండమీద నుండు పట్టణము మరుగై యుండనేరదు" అని ఆయన అన్నాడు (14బి వ.). ఆ రోజుల్లో, కొండలమీద లేక పర్వతాలమీద పట్టణాలు రెండు కారణాలను బట్టి నిర్మించేవారు. మొదటిది ఆచరణకు సంబంధించిన హేతువు: ఇది విలువైన వ్యవసాయ భూ భాగాన్ని వ్యర్థం చేయకుండుటకు. రెండవది భద్రతకు సంబంధించినది: తమ శత్రువులు సమీపించడాన్ని కొండమీద నుండి సులభంగా కనిపెట్టవచ్చు.[7] ఆ దేశం గుండా ఒక యాత్రికుడు వెళ్లినప్పుడు, ఒక పట్టణానికి అతడు ఎప్పుడు సమీపంగా వస్తాడో చెప్పగలుగు తుంటాడు: అదిగో అది కొండమీద ఉంది. మనుష్యులు తమ పట్టణాలను ఎలా దాచుకోరో, అలాగే మనం మన వెలుగును దాచుకోకూడదని ప్రభువంటాడు. దాని వర్తింపు ఈ క్రింది మాటలలో తేటగా కన్పిస్తుంది.

"మనుష్యులు దీపము వెలిగించి కుంచము క్రింద పెట్టరు" (15ఎ వ.). "గంప క్రింద పెట్టరు" అని NASBలో ఉంది. నేను చిన్నవాడనై ఉన్నప్పుడు యిది నన్ను తికమక చేసింది. కుంచపు గంప బాగా సందులు కలిగి ఉండేది. ఒక కొవ్వొత్తిగాని, లేక దీపంగాని దానిక్రింద పెట్టినట్టయితే, ఆ సందుల్లో నుండి వెలుగు ప్రకాశిస్తుంది. 1995 NASB తర్జుమాలో, "కొల-పాత్ర" అని ఉంది. ఇది ఒక మంటిపాత్ర.[8] దీపాన్ని దాని క్రిందపెట్టితే మాత్రం అది తప్పక ఆరిపోతుంది.[9]

ఉప్పు తన సారాన్ని పోగొట్టు కుంటే ఎంతో, (వెలుగును) దీపాన్ని కుంచం క్రింద పెట్టితేకూడ అదే ఉదాహరణ యౌతుంది. "నీవు తలంచే దానికంటె ఎక్కువైన విలువగల వాడవు" అనే ప్రసంగంలో చెప్పినట్టే, సారంలేని "ఉప్పుకు" విలువలేదు; దాచబడిన వెలుగుకు విలువలేదు. ఉప్పు తన సారాన్ని పోగొట్టుకొనడానికి ఎలా వీలుందో, అలాగే వెలుగు చీకటిని పారద్రోలే తన శక్తిని పోగొట్టుకొనడానికి వీలుంది. అది ఎలా సాధ్యమౌతుంది? వెలుగు దాచబడవచ్చు. విషాదకరంగా క్రీస్తును వెంబడిస్తున్నామని చెప్పుకునే అనేకులు తమ వెలుగును విషయ పరిజ్ఞానములేని "కుంచం" క్రింద, లౌకికమనే "కుంచం" క్రింద, పూర్ణ హృదయంలేని "కుంచం" క్రింద పెడతారు.[10] చివరి వర్గాన్ని గూర్చి "ద్విమనస్కులను నేను ద్వేషించుచున్నాను" అని దేవుడంటాడు (కీర్తన.

119:113ఎ). అంటే, "సగము సగముగా ఉంచేవారిని నేను ద్వేషించుచున్నాను" అని ఈ వచనాన్ని Moffatt తర్జుమా అంటుంది.

ప్రభువువారి దినాల్లో, జనులు వారి దీపాలను కుంచం క్రిందపెట్టేవారు కాదు గాని, దీపాలను దీపస్తంభం మీదనే ఉంచేవారు (15బి వ.). ఈ స్తంభాలు గోడలపై ఎక్కువగా ఉండేయి. కొన్నిసార్లు గోడ సందుల్లో దాన్ని పెట్టేవారు. "ఇంటనుండు వారికందరికి వెలుగు యిచ్చునట్టు" యిలా చేసేవారు (15సి వ.). అలాగే, "(మనుష్యుల యెదుట) మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" అని క్రీస్తు ప్రభువు అన్నాడు.

దాన్ని మనం ఎలా చేస్తాం? "మనుష్యులు మీ సత్ర్కియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" (16వ.). మనము సత్క్రియలు చేస్తూ ఉండగా – మనం ఎలా జీవించాలో అలా జీవించుతూ, యితరులకు సహాయం చేస్తూ ఉంటే మనం మన వెలుగును ప్రకాశింపజేస్తున్నాం.[11]

కొండమీద ప్రసంగంతో బాగా పరిచయమున్న వారినుండి నేను ఆక్షేపణను ఎదురు చూస్తున్నాను: తరువాత అధ్యాయంలో "మనుష్యులకు కనబడవలెనని" ప్రార్థించడం, ఉపవాసముండడం అనే దానికి వ్యతిరేకంగా క్రీస్తు హెచ్చరించాడు (మత్తయి 6:5; 6:16లను చూడు). కనబడవలెనని చేసే కార్యములకును, చేసే కార్యములు కనబడడానికిగల వ్యత్యాసమేమి? జవాబు "ఉద్దేశం, స్వభావం" అనేది. ఇతరులు మనలను పొగడునట్టుగా సత్క్రియలు చేయడానికిని, దేవుని మహిమ పరచునట్లు మన సత్క్రియలు యితరులకు కనబడడానికిని మధ్య ఎంతో వ్యత్యాసముంది.

మన వెలుగు ఏ మంచియైనా చేయవలసివస్తే, మనుష్యులు దానిని చూడవలసి యుంటుంది. రహస్యపు శిష్యత్వం ఏదీ లేదని ఒక వ్యక్తి అన్నాడు. రహస్యమనేది శిష్యత్వానైనా లయపరచుతుంది లేదా శిష్యత్వం రహస్యానైనా లయపరచుతుంది.

మన వెలుగును ఎందుకు ప్రకాశింపనియ్యాలి? మన సొంత వ్యక్తిగతమైన మహిమను కోరకూడదు. కాని దేవుని మహిమను మనం వెదకుతూ ఉండాలి. వెలుగు ఉద్దేశము తన వైపునకు దృష్టిని ఆకర్షించుకొనడం కాదు, దేని మీద అది ప్రకాశిస్తుందో దానిని అది వెలిగించడమే దాని ఉద్దేశం. భక్తిగల క్రైస్తవ జీవితాన్ని జీవించడంలో మనవైపు యితరుల దృష్టిని ఆకర్షించడం కాదు, ప్రభువైన యేసు తెలియజేసినట్టే, "పరలోకమందున్న మీ తండ్రిని మహిమపర"చడానికే (16సి వ.).

## ముగింపు

ఉప్పు, వెలుగు అనేవి ముఖ్యమైనవే. అనేకమైనవి కావాలని మనం కోరుకుంటాం కాని అవసరమైనవి కొన్నే. ఈ అవసరమైనవాటిలో ఉప్పు, వెలుగు అనేవి ఉన్నాయి. అవి లేకుండా మనం ఉండగోరం. "మీరు లోకమునకు ఉప్పయి యున్నారు," "మీరు లోకమునకు వెలుగైయున్నారు" అని ప్రభువు అన్నాడు. ఈ ప్రతిపాదనలలో యిమిడియున్న అభినందనను నీవు అభినందిస్తావని నిరీక్షిస్తున్నా. ఆ మాటలలో దాగియున్న సవాలును ఎదుర్కొనగలగాలని ప్రార్థన చేస్తాను.

సంఘం ఎలా తెలియబడుతుంది? నీవు ఆరాధించే, సేవించే స్థానిక సంఘాన్ని గూర్చి ప్రస్తావించినప్పుడు, జనులు ఏమంటారు? ఏదో ఒకదానికొరకు అది నిలిచియుందని (ఉప్పువలెను) ప్రభువు కొరకు ఏదో ఒకటి చేస్తున్నట్టు (వెలుగువలెను) అది నిలిచియుందా? నీ సంగతి ఏమిటి? నీ సమాజంలో నీ గుర్తింపు ఎమిటి? నీవు ఉప్పువేనా? నీవు వెలుగైయున్నావా?

మన చుట్టునున్న పాప ప్రపంచాన్ని గూర్చి మనం అనేకమార్లు దుఃఖిస్తాం. “ఎందుకు? అది ఎందుకు యింత చెడ్డదైపోతుంది?” అని మనం అడుగుతాం. “ఉప్పు, వెలుగు అనేవి ఎక్కడున్నాయి?” అని మనం అడుగుతామేమో! “లోకమునకు ఉప్పుగాను,” “లోకమునకు వెలుగుగాను”[12] ఉండునట్లు దేవుడు మనకు సహాయము చేయునుగాక.

---

సూచనలు

[1]“దీపము” “దీపస్తంభము” అనేది ఆది భాష. [2]ఆది భాష “మీరు” అనే విషయాన్ని నొక్కి పలుకుతుంది. క్రైస్తవుడవ్వడమంటే – చీకటిలో నుండి వెలుగులోనికి వచ్చినట్టు అని అనేక లేఖనాలు బోధిస్తున్నాయి: (యోహాను 8:12; అపో. 26:18; ఎఫెసీ. 5:8; ఫిలిప్పీ. 2:15, 16; 1 పేతురు 2:9). [3]విద్యను చులకనగా చేయడానికి ఈ ప్రతిపాదన చేయబడలేదు. ఎంత వీలుంటే – అంత ఎక్కువ విద్యను ప్రతివారు గడించాలని నేను నమ్ముతున్నాను. అయితే భౌతికమైన విద్యకంటె బైబిలు విద్య ఎక్కువ ప్రాముఖ్యమైనదని నొక్కి చెప్పుతున్నా. [4]“మీ వెలుగు ప్రకాశింపనియ్య”డానికి ప్రత్యేకమైన మార్గాలు మీ సమాజంలో ఏమి ఉన్నాయో చూడు. [5]దేవుని వెలుగు చీకటిని పారద్రోలే పరలోకంలో ఉండాలని నేను ఎదురుచూస్తున్నా (ప్రకటన 21:25; 22:5). ఈ మధ్యకాలంలో అంధకారమైన లోకంలో ఉండమని దేవుడు నన్ను కోరుతున్నాడు. [6]ఎంత చిన్న వెలుగైనా చీకటిని పారద్రోలుతుందనడానికి నీ సొంత ఉదాహరణలిమ్ము. [7]“కొండమీద కట్టబడిన” పట్టణాన్ని కాపాడడం సులభం. [8]కుంచంలో నాల్గవవంతు లేక 8:81 లీటర్లు. [9]కుంచం క్రింద పెట్టబడిన దీపం ప్రాణవాయువు అయిపోగానే ఆరిపోతుంది. అయితే క్రీస్తు ప్రాథమికంగా వెలుగును దాచిపెట్టడాన్ని గూర్చి మాట్లాడుతున్నాడు. [10]కుంచముల జాబితాను విస్తరింపజేయవచ్చు. నీ శ్రోతలకు తగిన జాబితాను ఉపయోగించు.

[11]నీ శ్రోతలు తమ వెలుగును ప్రకాశింపజేసే మార్గాలు ఏవో వాటిని నీవు విస్తరించవచ్చు. [12]నీవు ఈ ప్రసంగాన్ని ఉపయోగించేటప్పుడు, అవసరమైన విధానంలో తమ ప్రభావాన్ని సరిగా వినియోగించుకొనడానికి ప్రోత్సహించు. విశ్వాసము బాప్తిస్మము ద్వారా (మార్కు 16:16) కొందరు క్రైస్తవులు కావలసిన అవసరం ఉండవచ్చు. మారుమనస్సు, ఒప్పుకోలు, ప్రార్థన ద్వారా విశ్వాసంలో నిలకడగా లేని క్రైస్తవులు పునరుద్ధరింప బడవలసియుండవచ్చు (అపో. 8:22: యాకోబు 5:16).